# సృజన సాహిత్యం

# 'చిగురించే పేజీలు'

## నిర్వేదపు నదిని దాటిన కవిత్వం

కవిత్వం కేవలం పదాల సమాహారం ఎంతమాత్రం కాదని, కవిత్వమంటే అది మనసును తాకే ఒక గొప్ప అనుభూతి అంశమని, జీవితాన్ని అన్ని కోణాల్లో అర్థం చేసుకునే తాత్విక దృక్కోణమని కవిత్వ తత్వాన్ని సంతృప్తిగా అధ్యయనం చేసిన కవయిత్రి నాగజ్యోతిశేఖర్. నిత్యం కవిత్వం కోసం తపించే తత్వం ఆమెది. కవిత్వం గురించి ప్రతిక్షణం, శ్వాస ఆమెతో మాట్లాడుతుంది. శబ్దం చేస్తున్న లోపలి గుండె, తన నుండి ప్రవహించే రక్తంలో అక్షరాల నీడల కోసం వెతుకుతూ ఉంటుంది. కంటిరెప్పలను చీల్చి ఎక్కడో ఎదురుచూస్తున్న ఖాళీలను కవితలతో పూరించమని, నిద్రపోనివ్వని చీకటి రోజూ ఆదేశాలను జారీ చేస్తూ ఉంటుంది. ఈ నేపథ్యం నుంచి నాగజ్యోతిశేఖర్ వెలువరించిన సాహిత్య రూపమే 'చిగురించే పేజీలు' కవితా సంపుటి.

**రాత్రి గడిచేలోగా వెలుతురు పిట్టలను చేసి దిగంతాల ఆవలికి ఎగరేసుకుపోయే ఒక స్వాప్నికుడి గురించి ప్రస్తావించిన 'స్వాప్నికుడు' కవితలోని పదాలన్నీ మామూలు పదాలు కావు. మట్టిపొరల్లో అతడు చీమై దూరి నిర్మించిన సైకత కుటీరాల నుండి బయలుదేరిన ఒక శక్తివంతమైన రూపాలవి. ఒక భ్రమర గీతాన్ని రచిస్తున్న అతని ఏకాంతాన్ని భగ్నం చేయవద్దంటూ కవితలోని పదాలు కాపలా కాస్తున్నాయి.**

వెన్నెల్లో ఆకాశం వైపు చూస్తే చంద్రునిలో నదిలా ప్రవహిస్తున్న అతని చిరునామా, చనువుగా మన దగ్గరికి వచ్చి మన కళ్లకు వేకువ కాటుకను దిద్ది, స్వాప్నికుడి జగత్తులోని శాశ్వత బంధానికి ఆహ్వానాలు పలుకుతోంది. అతడు పచ్చటి కలలను పండించుకోవడానికి కాసింత స్థలాన్ని చదును చేసి పెట్టమని సూచిస్తున్న కవయిత్రి భావాలన్నీ ఓ కొండశిఖరం నుంచి విసిరేసిన వెలుగు బంతుల్లా మన ముందు గెంతుతూ ఆడుకుంటున్నాయి.

'ఇంకా రాస్తావా?' అంటూ అసహనంగా అడిగిన ఓ కరుకుతనానికి, పడకగదిలో కాళ్లు విరిగిన స్వప్నాలు, మంచం కోళ్లకు వేలాడుతున్న దృశ్యాల మధ్య నిలబడి 'ఏం రాయవద్దా?' అంటూ నిశ్చలంగా అడిగిన ఆమె మాటలకు అరల్లో దాచుకున్న పుస్తకాలు ఎర్రబడ్డ కళ్లతో చప్పట్లు కొడుతున్నాయి. ఆ ప్రోత్సాహానికి దుప్పటి మడతల్లో విలపించిన ఆమె చేతివేళ్ల నుంచి కారుతున్న సిరాచుక్కలు అక్షరాలై, కలం, కాగితాన్ని ఆమె అందుకునేలా చేస్తున్నాయి.

'ఒక అసంపూర్ణ సంభాషణ' కవితలో కవిత్వీకరించిన ఈ పద ప్రయోగాలన్నీ ఉన్నతస్థాయి యోగ్యతాపత్రాలను సగౌరవంగా అందుకునే స్థాయిలో ఉన్నాయి. **'కాళ్ల కింద అంతా తవ్వేసుకున్నాక / పైపైకి రావాలంటే / నిచ్చెనేసేది ఎవరు / ప్రకృతిని హత్య చేశాక / పడే ఉరిశిక్షను / రద్దు చేసేదెవరు...'** అంటూ 'శిథిలాల అడుగున' కవితలో, మానవ తప్పిదాలు చేసిన ఘోర ప్రమాదాల ఫలితాలను ప్రకటిస్తున్న ఈ కవయిత్రి, చీకట్లో రాలిపోతున్న చుక్కలను ఏరుకుంటూ, బోరుబావిలో పాతేసిన మట్టి పాడే పాట కోసం చెమటపట్టిన రాత్రుల తోడుగా అన్వేషణ సాగిస్తున్న ఒక శోధన మనతో స్నేహానికి దరఖాస్తు చేసుకుంటోంది.

సామ్రాజ్యవాదుల బాంబుల పక్షి ప్రపంచపటంపై అమాయక దేశాలను ముక్కున కరుచుకుని ఎగిరిపోతున్న క్రూర దృశ్యాలను 'సామాన్యీకరణ' కవితలో చిత్రీకరిస్తూ... **'రేపో మాపో మన పెరట్లోనూ / యుద్ధ విమానమొకటి వాలుతుంది / అప్పుడక్కడ మొలిచే సెమిత్రీలపై / పూలుంచేందుకు చేతులేవీ / మిగలకపోవచ్చు / ఎంత ఏడ్చినా గతాన్ని తవ్వేందుకు / భవిష్యత్తు ఉండకపోవచ్చు...'** అంటూ చిన్నారుల గాజుకళ్లపై పేరుకున్న క్షిపణి ధూళికణాలను చూపిస్తూ కవయిత్రి పలికిన ఈ మాటల నేపథ్యంలో, ప్రపంచం పొడవునా ఓ రక్తపు నది శవాలను మోస్తూ దీనంగా ప్రవహిస్తోంది.

'ఇంకెవరికి...' కవితలో మాతృమూర్తి స్వరూప స్వభావాలను మరోసారి సారవంతంగా ఆవిష్కరిస్తూ... **'దుఃఖాన్ని పూడ్చిపెట్టి / నవ్వుగా మొలకెత్తడం / ఆమెకు తప్ప ఎవరికి సాధ్యం...'** అంటూ కవయిత్రి చేసిన తీర్మానానికి, తన కొమ్మల మీద వాలిన పిట్టలన్నీ ఎగిరిపోయాక, గూళ్లు చెప్పే కథలను వింటున్న ఓ ఒంటరి చెట్టు, దుమ్ముపట్టిన తన చిరునామా పలకను తుడుచుకుంటూ ఈ కవితలో దర్శనమిస్తోంది.

కవిత్వపు దారుల్లో కురిసి కురిసి మేఘాల మధ్య తానూ ఒక అందమైన హరివిల్లుగా మారిపోవడం, చదివి చదివి పుస్తకంలోని పేరాలను స్వరాలుగా మార్చుకుని పాటగా వినిపించడం, నడిచిపోయిన నిన్నటికి, నడుస్తున్న నేటికి... ఈ రెండింటి మధ్య కవిత్వంగా ప్రవహించడం తన మీద ఎప్పటికీ ప్రయాణిస్తూనే ఉంటుంది.

**'సూరీడుతో ఆటలాడుతూ / గాలి కుంచె గీసిన నీడ గీతల్ని / నేలపై పరుస్తున్న ఆకులు / పిట్ట పాటకు నాట్యం చేస్తూ...'** అంటూ ఓ అద్భుత దృశ్యానికి సొంతదారుని పట్టాను అందించిన 'మూడవ ప్రపంచం' కవిత, పులకరించిన పుడమి నవ్విన పచ్చదనాన్ని మన కోసం గాఢంగా నమోదు చేస్తోంది. అదే సందర్భంలో గూడు చెదిరిన పక్షి, గుండె చెదిరిన చెట్టూ కలిసి పాడిన పాట, స్వరాలు కోల్పోయి, చరణాలు తెగిపోయి, చివరకు ఖండాంతరాలలో కన్నీరై ప్రవహిస్తోంది. ఆ తడిని మోస్తున్న




దినచర్యగా మార్చుకున్న ఈ కవయిత్రి భావాలన్నీ మరో నూతన ఉదయానికి స్వాగతం పలుకుతున్నాయి. **'ప్రయాణం / ఉదయాన్నే మొదలు పెడతాను / మరు ఉదయానికి గాని / రావాల్సిన వాక్యం రాదు...'** అంటూ 'పట్టాలు తప్పిన రాత్రి' కవితలో తన సాహిత్య ప్రయాణాన్ని ప్రస్తావించిన కవయిత్రి, తనలాగే తీరని బరువును గుండెలపై మోస్తున్న పట్టాలతో రోజూ ఆమె సంభాషిస్తుంది. ఆమె ఈ ప్రయాణంలో పట్టాలు తప్పిన రాత్రిని ఒక స్టేషన్‌లో వదిలేస్తుంది. ఒంటరితనాన్ని మరచిపోవాలనుకుంటూ ఉదయపు బుగ్గలపై సిరాచుక్క పెట్టగానే ఆకుపచ్చ అక్షరాల సిగ్నల్ తలెత్తుతుంది. ఆ వెంటనే కవిత్వం తన వేగానికి సంకేతాలను అందజేస్తుంది. **'అప్పటికి గాని నిద్ర / కనుపాపల బెర్తు పై వాలదు / నే తీసుకున్న టికెట్ ఖరీదు / కవిత్వం...'** అంటూ చివరలో చాలా గమ్మత్తుగా తన తలుపులను మూసుకున్న ఈ కవిత, మన జ్ఞాపకాల పట్టాల అక్షరాలు గుప్పెడు శాంతి కోసం కవిత్వాన్ని ఆశ్రయిస్తున్నాయంటారు కవయిత్రి.

ఈ సంపుటిలో తీవ్రంగా ఆలోచింపజేసిన కవిత 'బర్త్ మార్క్'. ఇక్కడ 'బర్త్ మార్క్' అనేది శరీరంపై ఉండే పుట్టుమచ్చ మాత్రమే కాదు; పుట్టుకతోనే సమాజం మోపిన కులముద్ర కూడా. ఈ కవితలో 'అతడు ఖాళీ కంచాన్ని కడుపులో పెట్టుకుని తిరుగుతుంటాడు' అనే వాక్యం అతని ఆకలిని, నిరంతరం బాధిస్తున్న పేదరికాన్ని తెలియజేస్తోంది. జీవితమంతా ఆకలితో అల్లాడుతున్నా, అతనికి ఈ సమాజంలో న్యాయం జరిగే అవకాశం ఎప్పటికీ రాదనే భావం 'అతని టోకెన్ నెంబరు ఎప్పటికీ రాదు' అనే ప్రతీక ద్వారా గొప్పగా వ్యక్తమవుతోంది. 'మురికి కాల్వల చివరే కావ్యాలు రాస్తుంటాడు' అనే భావవ్యక్తీకరణ ఒక అద్భుతమైన రూపకం. అందరిలాగే జన్మమెత్తినా సరే తాను మాత్రం అత్యంత దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నాడు.

బాధతో కార్చిన కన్నీళ్లే అక్షరాలై కావ్యాలుగా మారుతున్న దృశ్యాన్ని ఈ కవిత ఆవిష్కరిస్తోంది. **'పాదాల నుండి పుట్టానని రాసిన బర్త్ సర్టిఫికెట్ / ఇంకా తగులబెట్టడు ఎందుకో?'** అంటూ ఉన్న ఈ కవితలోని చివరి పాదాలు పురుషసూక్తంలోని వర్ణవ్యవస్థను గుర్తుచేస్తున్నాయి. ఈ కవిత కేవలం ఒక మనిషి బాధను వర్ణించడానికే పరిమితం కాలేదు. ఆ బాధకు కారణంగా నిలిచిన సామాజిక నిర్మాణాన్ని నిలదీసి నిలువునా కడిగేసిన కవిత ఇది.

నాగజ్యోతిశేఖర్ కవిత్వంలో ప్రపంచాన్ని గొంతెత్తి పిలిచే ఒక ధ్వని ఉంది. అమ్లవర్షాలు కురుస్తున్నా ప్రవహించడం మానని నదిలా తన కవిత్వ ప్రవాహాన్ని కొనసాగించగల సత్తువ ఆమె కలంలో ఉంది. కవిత్వమనే నది నుంచి నిత్యం పదాలను వెలికితీయాలన్న తపన, కవిత్వాన్ని నిత్యం ఒక తపస్సులా కొనసాగించగల కోరిక... ఇవన్నీ ఆమెలో గాఢంగా ఉన్నాయి.

**దారి పక్కన చెల్లాచెదురుగా ఉన్న స్వప్నాలను తన గుండెలోకి ఆహ్వానించి, వాటిని కవితలుగా తర్జుమా చేయగల ఆసక్తిని తన ఖాతాలో మెండుగా నింపుకోగల నేర్పరి ఈమె. రాయక తప్పని వాక్యాల కోసం సమయాన్ని తన సొంత ఖాతాలోకి అదనంగా జమ చేసుకోగల సమయస్ఫూర్తి గల తత్వం ఆమెది.**

కవిత్వాన్ని రాస్తున్నప్పుడు అందులో ఆర్ద్రత, గాఢత, సంక్షిప్తత, వైవిధ్యంగా సాగే భావవ్యక్తీకరణ, కవిత్వ భావాలను పొరలు పొరలుగా పేర్చగల నేర్పరితనం, స్పర్శను కోల్పోతున్న మెదళ్లను కదిలించగల శక్తి, పచ్చని కలలను వెంటేసుకుని పలకరించగలిగిన గుండె సవ్వడి, భ్రమించే భూగోళంపై చిన్నదిగా కనిపించే జీవితానికి తగిన నిర్వచనాన్ని అందించగల ఆలోచన, అవసరమైతే సూర్యుడి నుంచి కొన్ని కిరణాలను దోచుకుని కవిత్వ దారుల్లో దీపాలుగా వెలిగించగలిగే సాహిత్యపు గడుసుతనం, నది పాడుతున్న పాటలోని చరణాలను తన కవిత్వానికి అన్వయించుకునే చనువు... ఇలా ఈ అంశాలు కవిత్వ నిర్మాణానికి సహకరించినప్పుడు, ఆ కవిత కాలంతో పాటు నిలిచే చిరునామాలను తన సొంతం చేసుకోగలుగుతుంది.

ఈ సాహిత్య సూత్రాలను ఎంతో ఇష్టంగా ఉగ్గుపాలుగా స్వీకరించి, మంచి స్థాయి కవిత్వాన్ని ఈ సంపుటి ద్వారా అందించిన నాగజ్యోతిశేఖర్ ఎంతైనా అభినందనీయురాలు.

-సాహిత్య ప్రపూర్ణ
డాక్టర్ కె.జి. వేణు
98480 70084



## మనమందరం ఒక్కటే

ఓ నా సోదరుడా, సోదరీ!
నిన్న మీ ఏడ్పును విని
మీతో పాటు నేనూ రోదించాను
ఇవాళ మీ నవ్వును విని
మీతో పాటు నేనూ నవ్వాను
మీ సంకట పరిస్థితి తెలిసి
క్రితంరోజు కుంగిపోయాను
మీ విజయం సంగతి తెలిసి
నేడు పొంగిపోయాను

ప్రతి భాష మీద నాకు పట్టు లేకపోవచ్చు
కానీ కన్నీళ్లనూ వేదననూ కనగలను
మీ సంస్కృతి నా సంస్కృతికి భిన్నం
అయినా అన్ని పూవులూ
పరిమళాన్నే పంచుతాయి --
వాటి రకాలు వేరువేరైనా.

ఇక్కడ మధ్యాహ్నం వేళ
మబ్బులు కనబడితే
రాత్రిపూట నక్షత్రాలు దర్శనమిస్తాయి
తేడా ఉంది కదూ?
అయినా భిన్నంగా ఉంటూనే ఒకటిగా
ఉండటం అంటే ఇదే
దూరం నుంచి మీ చర్మపు రంగు
కనపడదు నాకు
మీ సంస్కృతి మీద,
నేలతత్వం మీద, భాష మీద
నాకు పూర్తి అవగాహన లేకపోవచ్చు
కానీ ఆత్మల తత్వాన్ని అనుభూతించగలను

నా సోదరుడా, సోదరీ,
నా ఆత్మ మీ ఆత్మలతో అనుసంధానమై
వాటిని సమ్మానిస్తూ గుసగుసలాడుతుంది
నమస్తే మిత్రులారా,
"నాలో నివసించే అంతర్యామి
మీలోని పరమాత్మకు వందనం చేస్తుంది"

ఆంగ్లమూలం: సర్గియో డినిజ్ ద కోస్టా
అనువాదం: ఎలనాగ

## నేడే రవీంద్రసూరికి 'సినారె' సాహితీ పురస్కారం

ప్రముఖ కవి, సినీ దర్శకుడు నామాల రవీంద్రసూరికి 2026 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మక "డా. సి. నారాయణరెడ్డి (సినారె) స్మారక సాహితీ పురస్కారం"ను సినారె కళాపీఠం, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖల సంయుక్త సహకారంతో ఆగస్టు 2న హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం సెమినార్ హాల్‌లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ప్రదానం చేయనున్నారు.

– మల్లెకేడి రాములు, అధ్యక్షులు, సినారె కళాపీఠం

నిర్వహణ : విల్సన్‌రావు కొమ్మవరపు
సాహితీ సంపాదకులు
k.wilsonrao@gmail.com

## నిశ్శబ్దం పెనుశబ్దం

కొన్ని ఆలోచనలు ఊహల్లోంచి
జారి మెదడు పొరల్లోనే కాదు
మట్టిపొరల్లోనూ కిందా మీద
కనిపించని నృత్యం...

కొన్ని అడుగులు ముద్దాడే నేల
రాళ్ళ ముళ్ళ అందాలను
భరిస్తూ భరిస్తూ ప్రేమగా గమ్యంలో ఒంపే
ఎర్రెర్రని నునువెచ్చని బొట్లుబొట్ల తొవ్వ
యుద్ధం ముందూ వెనుక ఉద్దీపన నిశ్శబ్దం

కొన్ని మాటలు
అంతరంగ సావాసం శబ్దగంధాల ధ్వని
ప్రతిధ్వనిలో యజ్ఞ ఋషుల
సంతకాల మౌనం

సంతకం మూగకాదు
సడిలేని చోట నిస్సవ్వడి
వలయ పరావలయ పరిధిలో... ఆవర్తన
పరావర్తన విన్యాస విస్ఫోటన నిశ్శబ్దం

మేల్కొల్పే ధ్వని చైతన్య ప్రేరణ
అంతర్ముఖ మూగరాగల ఉపాఖ్యానం

బలహీన గొంతు శూన్యగీతం
మెరుపు తీగ
అంకెల నడుమ మేఘాల విజృంభణే
సంఖ్యాశాస్త్రం
సర్వ విశ్వ రోగాలకూ
సామాజిక పెను ఆనకట్ట అది
అద్దంలో సైలెన్స్ ఓ మానసిక చికిత్స

చెట్టూ చేమ రాయీ రప్ప ప్రకృతి శోధనలో
వెలుగుచూసిన మరో ఆకుపచ్చ చెట్టు జీవం
అనిర్వచన నిశ్శబ్ద నాగరికత.

-డా.టి.రాధాకృష్ణమాచార్యులు
98493 05871

## మనం మిగుల్తున్నామా...!?

పుట్టుక...
కాలం అరచేతిలో మొలిచిన చిరు విత్తనం...

బ్రతుకు...
గాలిపటం దారంపై వేలాడే శ్వాసల లిపి...
ఆరాటాలన్నీ
ఇసుక గడియారపు ధూళి పరుగులు...
పేర్చుకున్న సంపద
చివరి ప్రయాణానికి వెంటరాని నీడలు

చేతుల నిండా కూడబెట్టింది
కాలం గుప్పెట్లో జారిన గాలి రేణువులు

భూమి ఒడిలోకి
ఖాళీ అరచేతులే తిరిగి చేరిక...

అప్పుడు...
ఇల్లు కాదు...
బంగారం కాదు...
హోదా కాదు...
ఒక మంచి పలకరింపు...
ఒకరి కన్నీటిని తుడిచిన వేళ్లు...
ఒక హృదయానికి వెలిగించిన దీపరేఖ...
ఒక జీవితానికి ఇచ్చిన ఊపిరి...
అవే...అవే...
మరణానికీ మసకపడని
అసలు అడుగుజాడలు..

మనిషి దేహం
మట్టిలో కలిసిన తరువాత కూడా.....
మనసు నాటిన మానవత్వం
మొలిచే అడవే నిజమైన వారసత్వం...

కాలం చెరపలేని ప్రతీ అడుగు
కీర్తి కాదు...
ప్రాణాలపై పరిమళంలా నిలిచిన
మన మంచితనపు ముద్రలే...

చివరికి
ఈ భూమి విడిచి వెళ్లేటప్పుడు
ఏమి తీసుకెళ్తున్నామన్నది కాదు
ఎంత సంపాదించామన్నదీ కాదు
ఎంతమందిలో మనం మిగుల్తున్నామన్నదే...

మన బ్రతుకు మిగులు సంపద

ఒక్కటి అందరూ.. గుర్తెరగాలి...

శ్మశానం దేహాన్ని స్వీకరిస్తుంది
సమాజం జ్ఞాపకాన్ని స్వీకరిస్తుంది
ఈ రెండింటి మధ్యే
మనిషి అసలు ఆస్తి దాగి ఉంటుంది
అదే ప్రశ్న
మనం మిగుల్తున్నామా..!?

-డా.కటుకోఝ్వల రమేష్
99490 83327

## 9న 'పెన్నిధి' పద్యకావ్య ఆవిష్కరణ

అబ్జ క్రియేషన్స్ సాహిత్య సాంస్కృతిక సంస్థ, అక్షరకుసుమాలు, హైదరాబాద్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో కోడీహళ్ళి ఫణి ప్రసన్న కుమార్ రచించిన 'పెన్నిధి' పద్యకావ్య ఆవిష్కరణ కార్యక్రమం ఆగస్టు 9, 2026 (ఆదివారం) నాడు సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్, (ప్రగతి నగర్, జె.ఎన్.టి.యు ఎదురుగా, హైదరాబాద్)లో జరుగుతుంది. సాధనాల వేంకటస్వామి నాయుడు అధ్యక్షతన జరిగే ఈ సభలో వింజమూరి విశ్వనాథమయ్య గ్రంథాన్ని ఆవిష్కరిస్తారు. యువభారతి అధ్యక్షులు, పద్యకళా ప్రవీణ డా॥ ఆచార్య ఫణీంద్ర కావ్య పరిచయం చేస్తారు.. రాధశ్రీ, మొవ్వ దేవనాథ సూరి, వేదాంతం శ్రీపతిశర్మ, మల్లయాచారి తదితరులు అతిథులుగా పాల్గొంటారు.

-కోడీహళ్ళి మురళీమోహన్

## ఆధునిక రైతు అసలు రూపం చూపే

# మాధవరావు కవిత్వం

బండ్ల మాధవరావు గారి కవిత్వ సంపుటి 'పొలం గట్ల వెంట' చదువుతుంటే చాలా చోట్ల మనసూ, మెదడూ ఏకకాలంలో స్పందిస్తాయి. రసాత్మక వాక్యం రాస్తూనే చదివే వారి మేధను సునిశితమైన అభివ్యక్తితో చైతన్యపరచడం ఈ కవిత్వం యొక్క 'హాల్ మార్క్' అని చెప్పవచ్చు. 50 కవితలతో వచ్చిన ఈ సంపుటి చదువుకోవడానికి ఎంతో వీలుగా ఉంది. ఈ అత్యాధునిక యుగంలో ఛిద్రమైన మానవ జీవన శకలాలను జాగ్రత్తగా, ఎరుకతో కవిత్వ కాన్వాసుపై పరచిన స్పష్టత ఇందులో ఉంది. నిజాన్ని నిర్భయంగా చెప్పే మార్గంలో సరళంగా, ఎన్నో రోజులు గుర్తుండేలా చెప్పగలది కవిత్వ ప్రక్రియ అని నా నమ్మకం. అలాంటి కవితలే మనల్ని మరింత మానవీయంగా మారుస్తాయి.

**ఈ సంపుటిలోని 50 కవితల్లో, ప్రతి కవితలోనూ గుండెను తాకే వాక్యం ఒకటి చొప్పున ఉంది. ఆ వాక్యం దగ్గర ఆగి, ఆలోచించి, ఒక నక్షత్రం (*), ఒక చుక్క (•), ఒక టిక్ మార్క్ పెట్టుకుంటూ చదివించేలా చేయడమే కవి సాధించిన విజయం. వందకు వంద శాతం ఈ సంపుటి ప్రత్యేక లక్షణం ఇదే. పొలం గట్టు, నేల, మట్టి, చెట్లు, రెమ్మలు, కొత్త చిగుళ్లు... రాత్రి, చుక్కలు, ఆరుబయట పారబోసిన వెన్నెల, గడ్డిపూల శబ్దం లాంటి తేట పదాలతో వివిధ సందర్భాల్లో ఏకసూత్రత కలిగిన మానసిక సంవేదనలను మాధవరావు ఈ సంపుటిలో నిక్షిప్తం చేశారు.**

'కరిగిపోయిన కొమ్మలకు వేలాడుతూ,/కొత్త చిగుళ్ల దేహాలను నాలోకి/ వొంపుకుంటున్నాను' అన్న ఈ కవి, తనలోంచి 'ప్రవహిస్తున్న ఒక నది గురించి ప్రస్తావించేందుకు' (27వ పేజీ) ఎంత మమేకమయ్యారో! ఆ 'పొలం గట్ల వెంట', 'తీగల దుఃఖ పరిమళాల పక్కన నిలబడి' (40వ పేజీ) ఎంత సమయాన్ని పరిశీలించారో!

ఈ కవితల్లోని వస్తువు కవి హృదయార్తిలో నలిగి, నాని, ఎర్రమన్ను వివిధ టెర్రకోటా కళాకృతులుగా రూపాంతరం చెందినట్లు (మెటామార్ఫాసిస్) అనిపిస్తుంది. కొండలు, నదులు, సముద్రాలు, అడవులు వంటివన్నీ చూడటానికే తప్ప ప్రవేశించడానికి కష్టసాధ్యమైనవి. కానీ, వాటిని ఆధునిక యాంత్రికత బాంబులతో పగులగొట్టి, బుల్డోజర్లతో కురచ చేసి ఆక్రమించింది. పర్యవసానంగా భూ ఉపరితలంపై ఉన్న అత్యద్భుతమైన ఎకోసిస్టమ్ ధ్వంసమైంది. మనిషి స్వార్థం తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కునే మూర్ఖత్వంగా పరిణమించింది; ఇదే మహా విషాదం. దీన్ని తేటగా, పదాల పటాటోపం లేకుండా, మార్మిక ఇనప తెరల వెనుక దాచేయకుండా సూటిగా వర్ణించిన తీరు పాఠకుడిని ప్రభావితం చేస్తుంది.

ఈ సంపుటిలో 'ఆమె నడుస్తూనే ఉంది' అనే కవిత (61వ పేజీ) కొన్నాళ్ల పాటు వెంటాడే కవిత. ఇది ఎంతటి అత్యున్నత ప్రశంసకైనా అర్హమైనది.

"పొలం గట్ల మీంచి రోడ్డున పడి నడుస్తోంది/ సద్దన్నంలో ఇంత పచ్చడి కలుపుకుని/ ఇన్ని మజ్జిగ నీళ్లు పోసుకుని తాగిన రోజుల నుంచీ/ అలవాటైన నడకే అయినా/ ఇప్పుడు మళ్లీ కొత్తగా నడుస్తోంది/ ఎకరాల పొలాలు గజాలుగా మారాక/ మట్టిని, తనని తవ్వుకుపోతున్న/ సరికొత్త రాక్షస మూకల్ని ఎదుర్కోవడానికి/ అపర కాళికలా మళ్లీ నడుస్తోంది... / ...రంగు మార్చిన రాక్షసుల నిర్బంధాల నడుమ/ వేసే ప్రతి అడుగూ బలంగా/ రేపటిలోకే పడుతోంది.../ ...కుట్రల్ని, కులాల కంపుల్ని, ముళ్ల కంపల్ని దాటుకుంటూ/ ఒకే లక్ష్యంతో నడుస్తున్న నడక/ జనం కోసం నడక/ జనంతో నడక"

ఈ కవితలో---ఒకనాడు ఒద్దికగా కొంగు చుట్టి, తలపై అన్నం గిన్నె మోసుకెళ్లి, పొలం పనులు చేసి, పశువులను ప్రేమతో సాకిన రైతు భార్య ఏ పరిస్థితుల్లో పొలం గట్ల వెంట రహదారులు దాటి ఉద్యమ బాట పట్టిందో ఆ వైనం తెలుస్తోంది. సాగినంత మేర ఆమె పాదాల ప్రతి కదలిక, అడుగడుగునా పోటెత్తే భావపరంపరల వాచ్య, అర్థ రెండింటిలోనూ గతి, గమన లయలను కవి సాధించారు. ఈ కవిత ఒక ఉద్యమ గీతంలా మనసులో ముద్రవేసుకుంటుంది; కళ్లెదుట మహిళా రైతు సజీవంగా కనిపిస్తుంది.

మరోచోట, కవి నిష్ఠుర నిజాలను ఇలా బహిర్గతం చేశారు: "వాగ్దానాల ప్రపంచం/ నిరంతరం చుక్కల్ని కోసి/ మూసిన గుప్పెళ్లతో పంచి పెడుతూనే ఉంటుంది/ తెరిచిన గుప్పెళ్లలోని శూన్యం తరచూ నిన్ను వెక్కిరిస్తూ ఉంటుంది" (93వ పేజీ)

"మాట బయటకు రాకుండానే/ అక్షరాలు కత్తెర్లకు




బలవుతున్నాయి/......అబద్ధపు గాడ్పులు వాసంత సమీరాలనుకోవడమే/ అతి పెద్ద విషాదం" (69వ పేజీ)

నేడు జరుగుతున్న రాజకీయ చర్చలు, సమావేశాలు, వరాల వర్షాలు ఎంతవరకు నిజమో తెలియని దుస్థితి ఏర్పడింది. దీనిని ఎత్తిచూపే వాక్యాలివి. "నీరింకిపోవాల్సిన చోట మనిషింకిపోవడమే విషాదం".

ఛత్తీస్‌గఢ్, వాయనాడ్ వంటి చోట్ల వచ్చిన లాండ్‌స్లైడ్స్, వరద ఉధృతి, బీభత్సం విశృంఖల మానవ నాగరిక వ్యాప్తి ఫలితమే కదా?! ఆ సమస్త జీవరాశి నష్టాన్ని ఒకే ఒక్క వాక్యంలో నిలిపిన కవి అభినందనీయుడు.

**మాధవరావు గారి కవిత్వంలో తెలుగు భాష తనను తాను అద్దంలో చూసుకుని మురిసే మురిపాల బిడ్డలా తోస్తుంది. భాషా నిబద్ధత, ప్రతి కవితనూ చెక్కిన నిర్మాణపరమైన శ్రద్ధ ఇందులో కనిపిస్తాయి.**

అండమాన్ సముద్రతీరం సాక్షిగా కవి చూసిన ఉదయాస్తమయాలను--- "ఎర్రటి మేఘావరణంలో/ కళ్లకింపైన సింధూరం ముద్ద / అలా అలా సముద్రపు గొంతులోకి దిగిపోతుంటే/ ఓ వింతైన అనుభూతి (పే.117) "మెరుస్తున్న వెండి తీరాల్ని/ మాటిమాటికి ముద్దాడుతున్న/ నీటి అలలు/ ....గొడ్డలి ఆయుధం కనుమరుగైన చోట/చెట్లకు పెరగటం ఒక్కటే కళ" (పే.118) అంటూ పలవరించారు.

గిట్టుబాటు ధర దొరకని రైతు బాధ, మాధవరావు గారి కవితలో---

**కాటాలకెక్కిన పంట బరువు**
**ఎప్పుడు రెండో వైపుకే వంగిపోతుంది**
**బేరన్లలో బంగారు వర్ణానికి తిరిగిన**
**పొగాకు బ్రోకర్ చేతుల్లో**
**నలుపుకు తిరిగి, చూర్ణమైపోతుంది**
**విరిగిన వెన్నెముక ఎప్పటికీ అతకదు**
**స్వేద భూముల్లో మొలకెత్తే మొక్కలు**
**కాలిపోయి కవురు కంపు వెదజల్లుతాయి"**
(పే.120),

**చూర్ణమైపోతున్న బతుకులు**
**ఆకు తీసిన ఈనెల్లా**
**చెత్త కుప్పలు చేరుతున్నాయి"** (పే.131)
అంటూ రోదిస్తుంది.

అంతా బాగానే ఉంది, 'దేశం వెలిగిపోతోంది' వంటి భ్రమల ఇనప తెరల్ని ఖండించి... పొలం గట్ల వెంట పయనించి బాధ్యతగల పౌరుల హృదయాల్లోకి చేరిన విషాద మధుర కవిత్వంగా మలచిన మంచి కవి మాధవరావు గారికి శుభాకాంక్షలు, అభినందనలు.

– డా.కాళ్ళకూరి శైలజ
98854 01882

